క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నకరికల్లు: విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్‌కోతలో అంతరాయం ఉంటుందని ఆశాఖ ఏఈ రూఫస్ డానియేల్ శుక్రవారం తెలిపారు. 33 కేవి.11కేవి సబ్‌స్టేషన్‌ల మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ముప్పాళ్ళ: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఈ నెల 12వ తేదీన మండలంలోని అన్ని గ్రామాల్లోను విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ రూఫస్‌డానియేల్ శుక్రవారం తెలిపారు. విద్యుత్ లైన్లు, 33/11కే.వీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): 11 కే.వీ లైన్‌లో ట్రీ కటింగ్ మరియు సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా 12వ తేదీన పట్టణంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ పి.రవికిరణ్ శుక్రవారం తెలిపారు. రెండో శనివారం , సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా ఉదయం 9 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలన్నారు. ఏదైనా విద్యుత్ సంబందించి సమస్యలకు సత్తెనపల్లి టౌన్ ఫ్యూజ్ ఆఫ్ కాల్ నంబర్ :9494116238 కు ఫోన్ చేయవచ్చన్నారు.

మండలంలోని 1,405 గ్రూపులకు రూ.2కోట్లు

నకరికల్లు: మహిళల కోసం సంక్షేమ పథకాలను సమర్ధవంతంగా అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని ఏపీఎం సునీత కొనియాడారు. వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని మండలంలోని రైతుభరోసా కేంద్రాల్లోని టీవీ ద్వారా మహిళలు శుక్రవారం తిలకించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 1,405 గ్రూపులకు చెందిన సభ్యులకు వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం ద్వారా రెండుకోట్ల అరవై ఐదువేల రూపాయలు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. మహిళల ఆర్థిక భరోసా, వారి కాళ్లపై వాళ్లు నిలబడే విధంగా వైఎస్సార్ సున్నావడ్డీ పథకం తోడ్పడుతుందని అన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

14న ఎన్నిక ధృవ పత్రాల అందజేత

రాజుపాలెం: మండలంలోని అనుపాలెం వార్డు మెంబర్‌కు చెన్నంశెట్టి శ్రీనివాసరావు , చౌటపాపాయపాలెం వల్లాల నాగరాజు, కొత్తబోధనం కంభంపాటి సావిత్రి, బ్రాహ్మణపల్లి వాసా రత్నకుమార్ ఆయా గ్రామాలలోని వార్డు మెంబర్‌లకు ఒక్కొక్కరే నామినేషన్ వేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు తెలిపారు. అధికారికంగా ఈ నెల 14వ తేదీన వారికి ధృవపత్రాలు అందిస్తామని తెలిపారు.

పంట కోత ప్రయోగాలపై అవగాహన

క్రోసూరు: క్రోసూరు వ్యవసాయ కార్యాలయంలో మండలంలోని అన్ని రైతుభరోసా కేంద్రాల సిబ్బందికి శుక్రవారం పంట కోత ప్రయోగాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఓ ఝాన్సీలక్ష్మీ మాట్లాడుతూ పంట కోత ప్రయోగాల వల్ల పంటదిగుబడి అంచనా వేయడం జరుగుతుందని, అదేవిధంగా పంట బీమా అమలు చేసేందుకు ప్రామాణికంగా తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అనంతరం పంట కోత ప్రయోగపద్ధతిపై అవగాహన కల్పించారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో 13 రకాల పంటకోత ప్రయోగాలు నిర్వహించాల్సి ఉందన్నారు. ఏడిఏ హనుమంతరావు మాట్లాడుతూ ఈ పంట నమోదు యాప్ గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఏఓ వేణుగోపాల్, రైతుభరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

మృతదేహం లభ్యం

అచ్చంపేట: మండలంలోని కోనూరు, కస్తల గ్రామాల మధ్యలోగల చంద్రా లిఫ్ట్ ఇరిగేషన్ స్కీముకు సమీంలోని కృష్ణానదిలో తేలుతూ కనిపించిన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గ్రామస్తుల ద్వారా గుర్తించినట్లు అచ్చంపేట ఎస్‌ఐ సీహెచ్ మణికృష్ణ శుక్రవారం విలేకరులకు తెలియచేశారు. చుట్టు పక్కల గ్రామాల్లో విచారించగా ఆచూకి తెలియకపోవడంతో కోనూరు వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు ఆదారంగా కేసు రిజిష్టరు చేయడం జరిగిందన్నారు. వ్యక్తి వయస్సు సుమారు 30 సంవత్సరాలు ఉండవచ్చని, ఎత్తు 5.5 అడుగులు, చామనచాయ రంగు కలిగి ఉన్నాడన్నారు. ఒంటిపై ఆకుపచ్చ, నలుపు రంగు షాట్ ధరించి ఉన్నట్లు చెప్పారు. వ్యక్తి యొక్క ఆచూకి తెలిస్తే వెంటనే అచ్చంపేట పోలీస్ స్టేషన్‌కు: 8640246033, 9440796234 నంబర్లకు ఫోనుచేసి సమాచారం అందించవలసినదిగా కోరారు.

విద్యార్థి అదృశ్యం

నరసరావుపేట టౌన్: బీటెక్ విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్ టౌన్ ఎస్‌ఐ ఎన్.వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. వైజాగ్, గాజువాక ప్రాంతానికి చెందిన పోతుల రాజేష్ ప్రకాష్‌నగర్‌లోని హాస్టల్‌లో ఉంటూ జొన్నలగడ్డ శివారు ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ 4వ సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 7వ తేదీన హాస్టల్ నుంచి కాలేజీకు అని వెళ్లిన రాజేష్ తిరిగి రాలేదు. అతని కోసం కుటుంబ సభ్యులు వెతికినా ఫలితం దక్కలేదు. ఈ మేరకు విద్యార్థి తండ్రి రమణ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పలు గ్రామాల్లో నాభూమి–నాదేశం



బెల్లంకొండ కళాశాలలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని పలు గ్రామాల్లో నా భూమి–నాదేశం కార్యక్రమం శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న డ్వామా పీ.డీ జీ.జోసఫ్ కుమార్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పెంచాలన్నారు. కార్యక్రమంలో భాగంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎన్ఆర్ ఈజీఎస్ సిబ్బంది, సచివాలయ సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు. అమృతసరోవర్‌లో భాగంగా చెరువుకట్టపైన మొక్కలు నాటారు. ఎంపీడీఓ పీ.పుట్టారెడ్డి, సర్పంచ్ కోటేశ్వరమ్మ, ఉపసర్పంచ్ సైదా, వైఎస్సార్ సీపీ నాయకులు ఎమ్‌జెఎమ్‌రామలింగారెడ్డి, కానాలపుల్లారెడ్డి, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగు గ్రామాల్లో ఆజాదీకా అమృత్‌మహోత్సవ్

అమరావతి: మండల పరిధిలోని నెమలికల్లు, ఉంగుటూరు, పెదమద్దూరు, వైకుంఠపురం గ్రామాల్లో శుక్రవారం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న ఆజాదీకా అమృత్ మహోత్సవ్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో స్వాతంత్ర్య సమరయోధుల, దేశనాయకుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఉమాదేవి విద్యార్థుల నుద్దేశించి మాట్లాడి అనంతరం వారిచేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నెమలికల్లు, పెదమద్దూరు గ్రామ సర్పంచ్ కోవూరు రాంబాబు, జాష్టి శ్రీనాద్ వైఎస్సార్ సీపీ నాయకుడు ఆళ్ళ శ్రీనివాసరెడ్డి, గ్రామ పంచాయతీల సిబ్బంది, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ



మాదలలో జరిగిన ప్రతిజ్ఞలో పాల్గొన్న పీడీ జోసఫ్ కుమార్



ఆజాదీకా అమృత్‌మహోత్సవ్‌లో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఉమాదేవి

చైర్మన్‌లు నాలుగు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో పాటు ఉపాధ్యా సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

బెల్లంకొండ: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బి.ఉమాదేవి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని కళాశాలలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమం ద్వారా నాదేశం– నా మట్టి కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 15 వరకూ కళాశాలలో వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో అధ్యాపకులు కవిత, శారదాదేవి, లక్ష్మీ సులోచన, కుసుమ కుమారి, సత్యప్రభ, వై రమేష్‌బాబు పాల్గొన్నారు.

రెండు గ్రామాల మధ్య మెటల్ రోడ్డు



మెటల్ రోడ్డుకు పనులు ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రాజుపాలెం: వెనుకబడిన గ్రామాల అభివృద్ధి కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి , మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డిలు అన్నారు. మండలంలోని బలిజేపల్లి నుంచి చాగల్లు వరకు మెటల్ రోడ్డు వేసేందుకు శుక్రవారం పనులు ప్రారంభించారు. త్వరలో పూర్తి చేస్తామని సర్పంచ్ గౌతుకట్ల జ్యోతి తెలిపారు. ముందుగా ఎంపీపీ , మండల అభివృద్ధి కమిటీ చైర్మన్‌లు కొబ్బరి కాయలు కొట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు గౌతుకట్ల గురవయ్య, ఎంపీటీసీ చౌడబోయిన వీరలక్ష్మీవేణు, వైఎస్సార్ సీపీ నాయకులు చావలి నాగరాజు, గౌతుకట్ల నరసయ్య, ఉప్ప సర్పంచ్ ఈసిరెడ్డి వీరారెడ్డి, కుంభా వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలించిన బ్యాంకు ఉన్నతాధికారులు



దొడ్లేరు చైతన్య గోదావరి బ్యాంకు ఎదుట ఆందోళనతో కిటకిట లాడిన ఖాతాదారులు

దొడ్లేరు(క్రోసూరు): దొడ్లేరు చైతన్యగోదావరి బ్యాంకులో తాకట్టు పెట్టుకున్న బంగారం వస్తువుల మాయం వ్యవహారం పై శుక్రవారం కూడా బ్యాంకు ఉన్నతాధికారులు రికార్డుల ప్రకారం బంగారం వస్తువులను తనిఖీ చేయడం ప్రారంభించారని తెలిసింది. బ్యాంకు ఉద్యోగులను విధులకు పాల్గొనకుండా ఉన్నతాధికారులే తగిన విధంగా తనిఖీలు చేస్తున్నారని తెలిసింది. ఈ కార్యక్రమంలో బ్యాంకులో బంగారం కుదువ పెట్టిన ఖాతాదారులు అనేక మంది బ్యాంకు వద్దకు చేరుకుని తమ బంగారం తమకు ఇస్తేనే అధికారులను బ్యాంకులోని అనుమతిస్తాని కొంత సేపు బ్యాంకు ఎదుట ఆందోళన చేపట్టారు. గ్రామపెద్దలు సలహా మేరకు బ్యాంకులోకి అధికారులను అనుమతించడం జరిగింది. పోలీసుబందోబస్తు నడుమ బంగారం అధికారులు ఖాతాదారులను పిలిపించి షెడ్యూల్ ప్రకారం రోజుకు కొంతమంది బంగారం వస్తువులు పరిశీలించే విధంగా స్లిప్పులు జారీ చేశారు. ఈనెల 31 వరకు స్లిప్పులు జారీ చేశారని తరువాత తిరిగి మిగతావారికి తేదీల ప్రకారం తాకట్టు వస్తువులు పరిశీలిస్తామని అధికారులు తెలిపారని ఖాతాదారులు తెలియచేశారు. బుధవారం, గురువారం వచ్చిన ఖాతాదారుల బంగారం వస్తువులు పరిశీలించగా బ్యాంకులో వస్తువులు బద్రంగా ఉన్నట్లు తెలిసిందని, మిగతావారివి పరిశీలించాల్సి ఉందని తెలిపారు. బ్యాంకులో సుమారు 1500 మంది ఖాతాదారులు బంగారం వస్తువులు పెట్టుకుని ఉండవచ్చునని భావిస్తున్నారు. ఏది ఏమైన బ్యాంకులో తాకట్టు బంగారం వస్తువులు బద్రంగా ఉన్నాయా, ఏమైనా అవతవకలు జరిగాయా అనేది తెలవాలంటే కొంత సమయం పడుతుందని అర్థమవుతుంది. ఈ విషయంపై పెదకూరపాడు సీఐ వీరాస్వామిస్పందిస్తూ త్వరలో బ్యాంకు అధికారులతో తప్పక చర్చిస్తానని తెలిపారు.

ఆర్బీకేల్లో ఎరువులను రైతులు వినియోగించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ, ఏఓ

బెల్లంకొండ: రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అందజేసే ఎరువులను రైతులు వినియోగించుకోవాలని ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని చైర్‌పర్సన్ తురకా ఏడుకొండలు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ నాణ్యమైన ఎరువులు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం గ్రామాల్లో ఎరువులను ఆర్బీకేల్లో అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. తహసీల్దార్ దుర్గేశ్వరరావు మాట్లాడుతూ సొంతగా పొలంలేని కౌలురైతులు ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలలో వివరాలు నమోదు చేయించుకుని, సంబందిత వీఆర్వోల నుంచి పంట సాగుదారుని హక్కు పత్రాలను పొందాలని తెలిపారు. ఏఓ కృష్ణయ్య మాట్లాడుతూ రైతుభరోసా అర్హత ఉండి, పొందని రైతులు ఆర్‌బీకేల్లో, పీఎం కిసాన్ అర్హులైన వారు కామన్ సర్వీస్ సెంటర్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు.

ప్రజా పంపిణీ బియ్యం పట్టివేత

182 బ్యాగులు, రూ.3.45 లక్షల విలువైన రేషన్ బియ్యం స్వాధీనం



రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు

బొల్లాపల్లి: ప్రజాపంపిణీ బియ్యం అక్రమ రవాణాపై విజిలెన్స్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. మండలంలోని వెల్లటూరు, సరికొండపాలెం, గుమ్మనంపాడు, బొల్లాపల్లి తదితర గ్రామాల్లో చౌకధరల దుకాణాలపై దాడులు నిర్వహించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ తహసీల్దార్ కె. నాగమల్లేశ్వరరావు, ఎస్‌ఐ ఎం. రామచంద్రారెడ్డి ఈ దాడుల్లో పాల్గొని మాట్లాడుతూ సమాచారం మేరకు మండలంలో దాడులు చేశామని, సుమారు సుమారు 182 బ్యాగుల్లో రూ.3.45 లక్షల విలువైన అక్రమ తరలింపు బియ్యాన్ని స్వాధీనపరుచుకున్నామని తెలిపారు. తెల్లవారుజామున సరికొండపాలెం రోడ్డు వద్ద రెండు టాటా ఏస్ వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న రేషన్ రైస్‌ను స్వాధీనపరచుకున్నామని తెలిపారు. ఈ వాహనాల్లో సుమారు 137 గన్నీబ్యాగ్‌లు స్వాధీనపరచుకుని స్టేషన్‌కు తరలించామని తెలిపారు. వెల్లటూరు గ్రామంలో ఖజ్జాయం రామారావుకు చెందిన ఇంటిలో తెల్ల బ్యాగుల్లో నిల్వ ఉంచిన 45 టిక్కీలను స్వాధీన పరచుకున్నామని తెలిపారు. 45 టిక్కీలను స్వాధీనపరచుకుని గుంటి ఆంజనేయస్వామి రైస్ అండ్ ఫ్లోర్ మిల్ యజమాని ఖజ్జాయం లక్ష్మీనారాయణకు తగిన భద్రత నిమిత్తం అప్పగించామని తెలిపారు. స్వాధీన పరచుకున్న 137 గన్నీ బ్యాగులను ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించామని తెలిపారు. రెండు సంఘటనలపై కేసు నమోదు చేశామని విచారణ చేపట్టామన్నారు. అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వారిపై చట్టపరంగా క్రిమినల్ చర్యలు తప్పవని అధికారులు తెలిపారు. దాడులు చేసిన వారిలో సీఎస్‌డీటి వై.లక్ష్మణరావు, సిబ్బంది రెహ్మాన్, పోలురాజు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

నరసరావుపేట టౌన్: రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం సాతులూరు రైల్వే స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. నరసరావుపేట రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని సాతులూరు నుంచి నుదురుపాడు వెళ్లే మార్గంలో సుమారు 50 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ టి. సుబ్బారావు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని ఏరియా వైద్యశాలకు తరలించారు.

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి



నకరికల్లు: రెవెన్యూ, వ్యవసాయశాఖ సిబ్బంది సమన్వయంతో పనిచేసి రైతులు సాగుచేస్తున్న భూములకు ఈ క్రాప్ నమోదు చేయాలని తహసీల్దార్ కె.నగేష్ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ క్రాప్ నమోదు పై శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్రాప్ నమోదు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు మూలాధారమని అన్నారు. మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు భూయజమానులతో మాట్లాడి కౌలు రైతులు సాగుచేస్తున్న భూములకు ఈ క్రాప్ బుకింగ్‌పై అవగాహన కల్పించి నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

రెండు వార్డులు ఏకగ్రీవం

నాదెండ్ల: మూడు గ్రామాల్లో జరగనున్న పంచాయతీ వార్డు మెంబర్ల ఉప ఎన్నికల్లో రెండు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మండలంలోని అమీన్ సాహె బ్ పాలెంలో నిండుజర్ల ఆంజనేయులు, ఇర్లపాడు లో మంద్రు కన్యాకుమారి నామినేషన్ దాఖలు చేశారు. ఇరుస్థానాల్లో ఒక్కొక్కరే నామినేషన్లు వే యటంతో ఆయా స్థానాలు ఏకగ్రీవమైనట్లు అధికారులు ప్రకటించారు. ఎండుగుంపాలెంలోనల్లబోతు ల కోటమ్మ, నల్లబోతుల మంగమ్మ ఇరువురూ నా మినేషన్లు దాఖలు చేశారు. వీరి నామినేషన్లను అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ నెల 14న ఉపసంహరణకు అవకాశం ఉంది. 19న ఉదయం 7 గంటల నుంచి ఒంటి గంట వరకూ ఎన్నిక జరగనుంది.

13న కంటి వైద్యశిబిరం

నాదెండ్ల: మండలంలోని గొరిజవోలు గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఈ నెల 13న మెగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నాదెండ్ల సొసైటీ చైర్మన్, కేవీఆర్ ఫౌండేషన్ అధినేత కురుకుంట్ల వెంకట రెడ్డి చెప్పారు. శంకర కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ జరుగుతుందన్నారు. ఉచిత వైద్య శిబిరాన్ని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ప్రారంభిస్తారన్నారు.

షాపులకు వేలం పాట

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో గుడ్‌విల్ పద్ధతిపై నూతనంగా నిర్మిస్తున్న కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్ షాపులకు శుక్రవారం వేలం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ పి.వెంకయ్య మాట్లాడుతూ బ్లాక్ నెం.7లో షాపు నెం. 9కు రూ.12.91 లక్షలు, షాపు నెం.23 రూ. 12.69లక్షలు, 24కు రూ.12.68 లక్షలు, బ్లాక్ నెం. 8లో గల షాపు నెం. 21కి రూ.14.34 లక్షలు, బ్లాక్ నెం. 9లోని షాపు నెం. 2కు రూ.14.35లక్షలు, షాపు నెం. 3కి రూ.14.36 లక్షలు, షాపు నెం. 21కు రూ.14.34 లక్షలకు మద్దతు ధర కంటే ఎక్కువగా పాడినట్లు తెలిపారు. అకాల వర్షం కారణంగా మిగిలిన షాపులకు ఈ నెల 14వ తేదీన బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కిరాణా దుకాణంలో చోరీ



దొంగలు పగలగొట్టిన కిరాణా షాపు పైకప్పు రేకులు

నాదెండ్ల: కిరాణా దుకాణంలో చోరీ జరిగిన సంఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. బాధితుడు మూలె భాస్కరరెడ్డి కథనం ప్రకారం గణపవరం నుంచి వేలూరు వెళ్లే డొంక రోడ్డులో హన్వికరెడ్డి కిరాణ్ జనరల్ స్టోర్ నడుపుతున్నాడు. రాత్రి 10 గంటల సమయంలో భార్యాభర్తలు ఇరువురూ షాపునకు తాళం వేసి ఇంటికి వెళ్లారు. శుక్రవారం ఉదయం షాపును తెరిచగా పై రేకుల కప్పు తొలగించి దొంగతనం జరిగినట్లు గుర్తించారు. సుమారు రూ.7 వేల నగదు, కొన్ని కిరాణా సరుకులు చోరీకి గురయ్యాయి. దీనిపై నాదెండ్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాత్రి వేళల్లో కొందరు వ్యక్తులు మద్యం తాగుతూ అర్ధరాత్రి సమయంలో చోరీ చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

ఓటర్ల జాబితాల సర్వే త్వరితగతిన పూర్తి చేయాలి

ఆర్డీఓ బీఎల్ఎస్ రాజకుమారి



ఓటర్లజాబితాల సర్వేను పరిశీలిస్తున్న సత్తెనపల్లి ఆర్డీఓ రాజకుమారి, తహసీల్దార్ భవానిశంకర్

ముప్పాళ్ళ: ఓటర్ల జాబితాలపై సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని సత్తెనపల్లి ఆర్డీఓ బీఎల్ఎస్ రాజకుమారి చెప్పారు. మండలంలోని మాదల, పలు దేవర్లపాడు గ్రామాల్లో జరుగుతున్న ఇంటింటి ఓటర్ల సర్వే ప్రక్రియను శుక్రవారం పరిశీలించారు. సర్వేలో గుర్తించిన అంశాలపై రిజిష్టర్‌ను నిర్వహించాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఫారం–6 ద్వారా ఓటు హక్కును కల్పించాలన్నారు. ఓటరు ఐడీలో ఏమైనా మార్పులు, చేర్పులు ఉంటే ఫారం–8 ద్వారా సవరించాలన్నారు. డబుల్‌ఎంట్రీ ఓటర్లు, మరణించిన ఓటర్లను పారదర్శకంగా విచారణ జరపాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలోని రికార్డులను తనిఖీ చేశారు. స్పందన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ కు సంబందించిన సమస్యలను వెంటనే పరిష్కరించుకోవాలని సూచించారు. తహసీల్దార్ ఎం.భవానిశంకర్, ఆర్ఐలు పవన్‌కుమార్, కపిల్‌దేవ్, ఆంజనేయులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయుల సేవలు అభినందనీయం



బదిలీపై వెళ్లిన 8 మంది ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది

నకరికల్లు: విద్యారంగానికి ఉపాధ్యాయుల సేవలు అభినందనీయమని ప్రధానోపాధ్యాయురాలు షేక్.షాహిం అన్నారు. మండలంలోని చేజర్లలోగల ఎస్వీ ఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేసి ప్రధానోపాధ్యాయుడు షేక్.రసూల్, మరో 7 మంది ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లగా శుక్రవారం వారందరిని పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుమూల గ్రామమైన చేజర్లలో పనిచేస్తూ విద్యార్థుల అభివృద్ధికి వారు చేసిన కృషి మరువలేనిదని అన్నారు. అంకితభావంతో పనిచేస్తే ప్రజల మనసులో చిరస్థాయిగా నిలిచిపోతారని కొనియాడారు. ప్రధానోపాధ్యాయుడు షేక్.రసూల్, ఉపాధ్యాయులు వినయ్‌సాగర్, వెంకటేశ్వరరావు, భ్రమరాంబ, బాజీ, వీరసేన తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గేరా మోహన్‌రావు, వెంకటేశ్వరరావు, షేక్.మస్తాన్‌వలి, మల్లికా, లలిత, వెంకట్రావు, సుందరరావు, షేక్.గౌస్ పాల్గొన్నారు.

మిరప నారుమడిలో జాగ్రత్తలు తీసుకోవాలి



దూళిపాళ్ళలో మిరప నారును పరిశీలిస్తున్న సీహెచ్ జనని

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): షెడ్‌నెట్ నర్సరీలలో పెంచే మిరప నారుమడులలో తప్పనిసరిగా యాజమాన్య పద్ధతులు పాటించాలని ఉద్యానవన శాఖాధికారి సీహెచ్ జనని చెప్పారు. మండలంలోని దూళిపాళ్ళ గ్రామంలో షెడ్‌నెట్ నర్సరీలో పెంచుతున్న మిరప నారును శుక్రవారం పరిశీలించి పలు సూచనలు చేశారు. ట్రేలలో పెంచే నారుమడిలో ఆశించే రైజోక్టోనియా వేరుకుళ్ళు తెగులు నివారణకు మాంకోజెబ్ కార్బెండిజమ్ మిశ్రమాలలో లీటరు 2.5గ్రా. చొప్పున కలిపి పిచికారి చేయాలన్నారు. బ్యాక్టీరియా ఆకుమచ్చ తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 30గ్రా, 1గ్రా. స్ట్రెప్టోసైక్లిన్ 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. సూక్ష్మపోషక మిశ్రమాన్ని లీటరు నీటికి 2.5గ్రా. చొప్పున కలిపి పిచికారి చేయాలన్నారు. షెడ్‌నెట్‌లో మిర్చినారు పెంచే చోట అధిక వర్షాలు పడినప్పుడు ప్రొట్రేలలో ఉన్న మొక్కల పై వెంటనే పట్ట కప్పుకోవాలి. నీరు నిలబడకుండా కాలువల ద్వారా నీరు పారించాలి. నర్సరీ నిర్వాహకులు సస్యరక్షణ చర్యలు తగ సమయంలో పాటించి నాణ్యమైన ఆరోగ్యకరమైన మిరపనారు రైతులకు అందించాలని సూచించారు. ప్రతి నర్సరీ నిర్వాహకుడు తప్పనిసరిగా రికార్డులు నిర్వహించాలని సూచించారు. ప్రతి రైతుకు బిల్ ఇవ్వాలని, నర్సరీ బెడ్లపై బెడ్‌నెం. పంట, కంపెనీ పేరు, రకం, విత్తనం నాటిన తేదీ సూచికలు పెట్టవలెను. నర్సరీ దారులు నారుపెంచే రశీదు పుస్తకములు పొందుపరచాలని తెలియజేశారు.

పత్తిలో తామర పురుగు నివారణ చర్యలు చేపట్టాలి



కొమెరపూడిలో పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): పత్తిలో బెట్ట పరిస్థితిలో ఉండడంతో తామరపురుగు, ముడత ఎక్కువగా కనిపిస్తోందని, వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని వ్యవసాయపరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డా.శ్రీలక్ష్మీ, కీటక విజ్ఞాన శాస్త్రవేత్త డా.డయానా చెప్పారు. సత్తెనపల్లి మండలంలోని కొమెరపూడి గ్రామంలో గుంటూరు వ్యవసాయ పరిశోధనా కేంద్రం పత్తి విభాగం, రిలయన్స్ ఫౌండేషన్‌తో కలిసి సంయుక్తంగా చేపట్టిన ప్లాంట్ డయాగ్నోస్టిక్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పత్తి పంటను పరిశీలించి పలు సూచనలు చేశారు. తామర పురుగును వ్యాప్తి చేసే టొబాకోస్ట్రీక్ వైరస్ కూడా పత్తి మొక్కలపై ఉందన్నారు. ఈ తామర పురుగు నివారించడానికి ఎకరానికి 10 చొప్పున నీలిరంగు జిగురు అట్టలను పొలంలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఒక ఆకుకి 6కంటే ఎక్కువ తామరపురుగులను గమనించినట్లయితే ఫిప్రోనిల్ మందు ఎకరానికి 400 మి.లీ లు 200లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలని చెప్పారు. ఈ సమయంలో పత్తిలో ఎసిఫేట్ కానీ, నువాక్రాన్ గాని వాడినట్లయితే బాగా రొట్ట చేసి రసం పీల్చే పురుగుల ఉధృతి బాగా పెరిగే అవకాశం ఉంటుంది కాబట్టి ఈ మందులను వాడకూడదని, అలాగే 60 రోజుల వరకు నియోనికోటినాయిడ్ మందులైనటువంటి ఇమిడాక్లోప్రిడ్ కానీ ఎసిటామప్రిడ్ కానీ థయోమిథాక్సిం కానీ రైతులు వినియోగించరాదని శాస్త్రవేత్తలు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సహాయకుడు శివశంకర్, రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు వీరభద్రం, మాణిక్యారావు, రైతులు పాల్గొన్నారు.

ఆరుతడి పంటలపై ఆసక్తి చూపాలి

శావల్యాపురం: రైతులు ఆరుతడి పంటల సాగుకు ఆసక్తి చూపాలని ఏడీఏ బోయపాటి రవిబాబు కోరారు. శుక్రవారం మండలంలోని కనమర్లపూడి గ్రామం రైతుభరోసా కేంద్రంలో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏడీఏ రవిబాబు మాట్లాడుతూ వర్షాభావం తక్కువగా నమోదైందని ఈక్రమంలో రైతులు ఆరుతడి పంటలైన కంది, మినుము, మిల్లెట్స్ తదితర పంటలను సాగు చేయాలన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించ వచ్చునన్నారు. అలాగే రైతుభరోసా కేంద్రాల్లో ఎరువులు కొరత లేదని, అర్హత కలిగి యున్న కౌలు రైతులందరు రైతుభరోసా కేంద్రాల ద్వారా సత్వరమే పంట సాగు ధ్రువీకరణ పత్రాలు పొందాలన్నారు. ఈ పత్రాలు పొందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన కౌలు రైతులు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రైతుభరోసా కేంద్రంలో ఎరువుల నిల్వలను పరిశీలించి రైతులతో మాట్లాడి తగు సూచనలు చేశారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు, వీఏఏ డి.స్రవంతి, రైతులు పాల్గొన్నారు.

తల్ సైనిక్ క్యాంప్‌కు ఎస్ఎస్ అండ్ ఎన్ విద్యార్థులు

నరసరావుపేట ఈస్ట్: శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల చెందిన ఐదుగురు ఎన్‌సీసీ క్యాడెట్స్ ఈనెల 10వతేదీ నుంచి 19వ తేదీ వరకు తిరుపతిలో నిర్వహిస్తున్న ఏపీ, తెలంగాణా రాష్ట్రాల ఎన్‌సీసీ ఇంటర్‌గ్రూప్ ఛాంపియన్‌షిప్ (తల్ సైనిక్ క్యాంప్) పోటీలకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సోము మల్లయ్య, ఎన్‌సీసీ ఆఫీసర్ మేజర్ బీఎస్ఆర్‌కె రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ విద్యా ర్థులు కె.వెంకటేష్, ఎ.రామారావు (ఆబ్టికల్స్), డి.నిఖి లేశ్వర్, వి.సింధూర (ఫైరింగ్), ఎం.పవన్ కుమార్ (ఆరోగ్యం, పరిశుభ్రత) అంశాలలో పోటీ పడనున్నారని వివరించారు. విద్యార్థులను కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త, అధ్యాపకులు అభినందించారు.